సాక్షి
నిర్మల్
ఆదివారం ॥ 11 ॥ ఆగస్టు ॥ 2024



ఆగస్టు వర్షాలపైనే భారం!

గత జూలై 1న బాబ్లీ గేట్లు ఎత్తినా ఎస్సారెస్పీలోకి వరదనీరు అంతగా చేరలేదు. ఆగస్టులో భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండే అవకాశముంది. 8లో▸

తక్కువ అద్దెకే ఆర్టీసీ బస్సులు

నిర్మల్ టౌన్: పెళ్లి ముహూర్తాల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను తక్కువ అద్దెకే ఇస్తున్నట్లు డీఎం ప్రతిమారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డిపాజిట్ లేకుండా కాలం, దూరానికి మాత్రమే చార్జీ వసూలు చేస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 3వరకు పెళ్లి బస్సు బుక్ చేసుకుంటే 10శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. 9592767879, 7382842582 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 /25.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అధిక ధరకు విక్రయించొద్దు



ఎరువుల గోదాంను పరిశీలిస్తున్న అంజిప్రసాద్

లోకేశ్వరం: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎరువుల గోదాంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించవద్దని, పంటలకు తెగుళ్లు సోకితే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారమిచ్చి సలహాలు పొందాలని రైతులకు సూచించారు. ఆయన వెంట భైంసా ఏడీఏ వీణ, లోకేశ్వరం ఏవో గణేశ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఉన్నారు.

గల్ఫ్ బాధితుడికి బాసట

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకు చెందిన గల్ఫ్ బాధితుడిని రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. కువైట్‌లోని ఎడారిలో ఒంటెలు కాస్తున్న ముధోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన నాందేవ్ కొద్దిరోజులుగా ఎడారిలో కఠిన పరిస్థితుల మధ్య ఇబ్బందులు పడుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్ట్ చేశాడు. దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం రియాద్, కువైట్ రాయబార కార్యాలయాన్ని సంప్రదించింది. ప్రస్తుతం అతను క్షేమంగా ఉన్నాడని, అతడిని తిరిగి రప్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు.

20న ఇంటర్వ్యూలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 57 వైద్యాధికారుల పోస్టుల నియామకాలకు ఈనెల 20న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు సీఏఎస్, ఆరు ప్రొఫెసర్, 14 అసోసియేట్ ప్రొఫెసర్, 18 అసిస్టెంట్ ప్రొఫెసర్, 17 సీనియర్ రెసిడెంట్ పోస్టుల నియామకానికి స్థానిక మెడికల్ కళాశాలలో ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రంగపేటను పంచాయతీగా గుర్తిస్తూ ఉత్తర్వులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోగల అనుబంధ గ్రామాల్లో ఒకటైన రంగపేట నూతన గ్రామపంచాయతీగా ఆవిర్భవించింది. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. జిల్లాలో ఇదివరకు 396 గ్రామపంచాయతీలుండగా మరో నాలుగు గ్రామాలను నూతన పంచాయతీలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ జాబితాలో ఖానాపూర్ మండలానికి చెందిన రంగపేటతో పాటు కడెం మండలానికి చెందిన న్యూ ధర్మాజీపేట్, తానూర్ మండలానికి చెందిన కల్యాణి, కుభీర్ మండలానికి చెందిన రంజనితండా ఉన్నాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

మహిళలను వేధిస్తే రౌడీషీట్

నిర్మల్ టౌన్: మహిళలను వేధింపులకు గురిచేస్తే రౌడీషీట్ తెరుస్తామని ఎస్పీ జానకీ షర్మిల శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కాలేజీలు, స్కూళ్లు, షాపింగ్ మాళ్లు, మహిళలు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో నిర్మల్ పోలీస్ సిబ్బంది, షీ టీం మఫ్టీలో తిరుగుతుంటారని తెలిపారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడేవారిని గమనిస్తూ ఉంటారని హెచ్చరించారు.

కాలంచెల్లిన మందులు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: కాలం చెల్లిన మందులను ఉపయోగించవద్దని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రాజేందర్ సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని ఫార్మసిస్టులతో ఆయన శనివారం సమావేశమై మాట్లాడారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొరత ఉంటే ముందుగానే సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి తెచ్చుకోవాలని తెలిపారు. కుక్క, పాము కాటుకు మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే.. మనూలెందరో!

జాతీయస్థాయికి ఎదిగి..



కాసింత ప్రోత్సహిస్తే.. ఏ స్థాయికి ఎదుగుతారనే దానికి రుచితనే ఓ ఉదాహరణ. దిలావర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన నామాయి నర్సవ్వ, ముత్యం దంపతుల కుమార్తె రుచిత వందమీటర్ల హర్డిల్స్‌తో పాటు వివిధ అథ్లెటిక్స్‌లో అదరగొడుతోంది. స్థానిక లిటిల్‌స్కాలర్ స్కూల్లో నాలుగోతరగతి వరకు చదివి, ఐదులో హకీంపేట క్రీడాపాఠశాలలో సీటు సాధించి ఇక తిరిగి చూడలేదు. అక్కడి కోచ్‌ల ప్రోత్సాహంతో వందమీటర్ల హర్డిల్స్‌లో ఆరితేరింది. బెంగళూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఎంపికైంది. 2017లో పూనెలో జరిగిన జాతీయస్థాయిలో పోటీల్లో కాంస్య పతకం సాధించింది. 2018లో సౌత్ జోన్ పోటీల్లో లాంగ్‌జంప్‌లో సిల్వర్‌మెడల్ కొట్టింది. 2019లో విజయవాడలో జరిగిన జాతీయ పోటీల్లో వందమీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం సాధించింది. ఖేలో ఇండియా పోటీల్లోనూ సిల్వర్ మెడల్ గెలుచుకుంది. 2023లో 38వ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో వందమీటర్ల హర్డిల్స్‌లో రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం రుచిత జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సిద్ధమవుతోంది. తల్లిదండ్రులు, చిన్ననాటి గురువుల ప్రోత్సాహంతోనే రుచిత ఈస్థాయికి చేరుకుంది.



జిల్లాకేంద్రంలోని మినీస్టేడియం ఇలా..



ఒలింపిక్స్‌లో కాంస్యపతకాలు సాధించిన మనూభాకర్ (ఇన్‌సెట్‌లో)

- జిల్లాలో ఆటలకు ఆదరణ కరువు
- నేటికీ ఒక్క స్టేడియం లేని వైనం
- పట్టింపు కరువైన మినీస్టేడియం
- బడిస్థాయి దాటని ఆటగాళ్లెందరో..
- కాస్త సహకరిస్తే.. ఎదిగేవాళ్లెందరో..

నిర్మల్: 'ఆహా.. ఓహో.. మనోళ్లు ఒలింపిక్స్ పతకాలు సాధించారహో..' అంటూ సంబురాలు చేసుకోవడం, ఆ పతకాలు తృటిలో తప్పినా.. ఒకవేళ ఓడిపోయినా.. 'అయ్యో.. మనోళ్లు ఎప్పుడూ ఇంతే..' అని ఆడిపోసుకోవడం మినహా.. ఎప్పుడైనా క్రీడలను ఎంతవరకు ప్రోత్సహిస్తున్నామని ఎవరూ ఆలోచించడంలేదు. దేశం, రాష్ట్రమే కాదు.. కాసింత ప్రోత్సాహం అందిస్తే.. మన జిల్లా నుంచీ మనుబాకర్‌లాగా విశ్వవిజేతలుగా నిలిచే సత్తా ఉన్న క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారు. కానీ.. క్రీడలంటే ఏదో కార్యక్రమంలా మమ.. అనిపించడమే అన్నట్లు పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరే ఎంతోమంది క్రీడాకారుల ఆశలను ఆదిలోనే చిదిమేస్తోంది. ఒకవేళ అన్నింటినీ తట్టుకుని జిల్లా, రాష్ట్రస్థాయి వరకు చేరినా.. ఆపై ప్రోత్సాహం అందడం లేదు. జిల్లాలో ఎంతోమంది మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులు కాసింత ప్రోత్సాహం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఒలింపిక్స్‌వేళ.. చాలామంది తమలోని ఆటను తలుచుకుంటూ.. తమకూ ఆ స్థాయిలో ఆడే అదృష్టం దక్కాలని కోరుకుంటున్నారు. ఏదైనా సాధించాలన్న తపన, ఉత్సాహం ఉన్నా.. సరైన ప్రోత్సాహం లేక విధిలేని పరిస్థితుల్లో తమలోని క్రీడాకారున్ని చంపేసుకుంటున్న వారూ ఉన్నారు.

ఎవరికీ పట్టదు!

'ఇంత పెద్దదేశం నుంచి ఒలింపిక్స్‌కు అంతమంది వెళ్లారు. ఒక్కరు కూడా బంగారు పతకం సాధించలేకపోయారు..' అని చాలా సింపుల్‌గా విమర్శలు చేస్తుంటాం. కానీ.. ఒక్కసారి గుండెపై చేయి వేసుకుని ఆలోచిస్తే.. మనలో ఎంతమంది క్రీడాకారులు, క్రీడలను ప్రోత్సహిస్తున్నాం..? మన పిల్లల్ని కనీసం ఆడుకోనిస్తున్నామా..? అని ప్రశ్నించుకోవాల్సిన తరుణమిది. 'ఆడుకుంటావా.. ఏం ఆడుతావ్..! ముందు పోయి సక్కగ చదువుకో..' అనే తల్లిదండ్రులు, 'గేమ్స్ తర్వాత.. ఫస్ట్ పెట్టిన టెస్టులో మార్కులు రాకపోతే అప్పుడు చెబుతా.. అని గద్దించే ఉపాధ్యాయులు, 'స్టేడియాలు కట్టిస్తాం.. ఆటలను ప్రోత్సహిస్తాం..' అని ఊకదంపుడు ఉపన్యాసాలే గాని.. ఏదీ చేయని పాలకులు, అధికారులు. ఇలా ఎక్కడా.. ఎవరూ.. సహకరించకపోవడంతోనే క్రీడలవైపు వెళ్లేవాళ్లే లేకుండా పోతున్నారు.

ఆడేందుకు చోటేది?

ఆటలు ఆడాలంటే కనీస సదుపాయాలున్న మైదానాలుండాలి. అసలు పాఠశాల స్థాయిలోనే గ్రౌండ్ ఉంటేనే అనుమతి ఇవ్వాలన్న నిబంధన ఉంది. కానీ.. ఇప్పుడు జిల్లాలో చాలా స్కూళ్లలో విద్యార్థులు ఆడుకునేందుకు కనీస మైదానాలు లేవు. ఇక ఆడించే పీఈటీలను వేరే పనులకు ఉపయోగించుకుంటున్నారు. మండలకేంద్రానికో మినీ స్టేడియం కట్టిస్తామంటూ.. గతంలో హామీల వర్షం కురిపించిన నేతలు ఏళ్లు గడిచిపోతున్నా పట్టించుకోవడం లేదు. జిల్లాకేంద్రంలో ఉన్న ఒక్క ఎన్టీఆర్ మినీస్టేడియం పేరుకే అన్నట్లు ఉంది. ఇక్కడ ఆటలు కాకుండా వాణిజ్య కార్యకలాపాల కోసం మైదానాన్ని ఇవ్వడానికే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. భైంసా, ఖానాపూర్‌లో స్టేడియాలున్నా.. కోచ్‌లు లేకపోవడంతో వృథాగా మారాయి.

ప్రోత్సహిస్తే చాలు..



జిల్లాకేంద్రానికి చెందిన మంగ్లారపు వెన్నెల ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయురాలు. తను ఎక్కడ పనిచేసినా తన విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను గుర్తించడమే కాకుండా తనవంతుగా ప్రోత్సహిస్తూ వస్తున్నారు. సోన్ మండలం కద్తాల్ పాఠశాలలో పని చేస్తున్నప్పుడు చిల్ల పల్లవి, పోలపల్లి నిఖితను ప్రోత్సహించడంతో వారు జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తాచాటారు. గ్రామీణప్రాంతం నుంచి వీరిద్దరూ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు.

సైకిల్‌పై దూసుకుపోతూ..



దస్తురాబాద్ మండలం దేవునిగూడెం గ్రామానికి చెందిన వ్యవసాయ దంపతులు పోరండ్ల కిష్టయ్య, బుచ్చవ్వలకు ఆటలంటే అంతగా తెలియవు. కానీ.. తమ బిడ్డ మౌనిక ఆశలకు మాత్రం ప్రోత్సాహం ఇస్తున్నారు. డిగ్రీవరకూ జిల్లాలోనే చదివిన మౌనిక బీ.పీఈడీ కోసం కష్టపడి వరంగల్‌కు వెళ్లింది. అలా అక్కడ ఓ మిత్రురాలిని చూసి తానూ సైకిల్ పట్టుకుంది. అలా.. ఏకంగా జాతీయస్థాయి సైక్లింగ్‌లో పాల్గొనే వరకూ దూసుకుపోయింది. ఇప్పటికే రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకాలను దక్కించుకుంది. మళ్లీ జాతీయ స్థాయిలో పతకం కొట్టేందుకు సిద్ధమవుతోంది. కానీ.. తనకు ఆ పోటీల్లో పాల్గొనే స్థాయి ఉన్నా సైకిల్ కొనేందుకు కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది.

క్రీడలను ప్రోత్సహించాలి



క్రీడలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలి. పిల్లలకు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి ఆటలు అవసరం. ప్రభుత్వం నుంచి వస్తున్న నిధుల మేరకు ఉన్నంతలో మా వంతుగా క్రీడలకు సహకరిస్తున్నాం. జిల్లాలో పలుచోట్ల స్టేడియాలు ఉన్నప్పటికీ ఇంకా కోచ్‌ల నియామకాలు చేపట్టలేదు.
– శ్రీనివాస్, జిల్లా క్రీడలశాఖాధికారి

ప్రోత్సహిస్తే సాధిస్తారు



విద్యార్థుల్లో చదువుతో పాటు చాలా నైపుణ్యాలు ఉంటాయి. వాటిని గుర్తించి కాసింత ప్రోత్సాహం అందిస్తే వారు కచ్చితంగా రాణిస్తారు. గ్రామీణ ప్రాంతాల నుంచే ఎక్కువగా విద్యార్థులు ఆటలపై ఆసక్తి చూపుతున్నారు. సరైన సహకారం లేనికారణంగానే చాలామంది మధ్యలో ఆగిపోతున్నారు.
– వెన్నెల, వ్యాయామ ఉపాధ్యాయురాలు

ఇదేం స్వచ్ఛదనం?



ఈసారి రాష్ట్రప్రభుత్వం పచ్చదనంతో పాటు స్వచ్ఛదనాన్నీ పాటించాలంటూ సరికొత్త కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఈనెల 5నుంచి 9తేదీ వరకు జిల్లాలోనూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం జిల్లాలో ఏ తీరుగా సాగిందో తెలుసుకోండన్నట్లుగా ఈ చిత్రం నిలుస్తోంది. అటవీశాఖ బాసర సర్కిల్ కార్యాలయం ఎదుట స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన సెల్ఫీపాయింట్ వద్దనే ఇలా.. చెత్తాచెదారాన్ని పడేశారు. దీనిపై బాటసారులు పెదవి విరుస్తున్నారు. – నిర్మల్

సీఎం నోట బొజ్జు ప్రస్తావన

ఖానాపూర్: రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ శనివారం నిర్వహించిన ప్రవాస భారతీయుల సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేరు ప్రస్తావించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఇందిరమ్మ ఇంట్లో ఉండే వ్యక్తిని కాంగ్రెస్ గుర్తించి ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే అక్కడి ప్రజలు గెలిపించుకున్నారని పేర్కొన్నారు. గతంలో పలు సభలు, సమావేశాలతో పాటు అసెంబ్లీలోనూ ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తాజాగా అమెరికాలో నిర్వహించిన సభలోనూ సీఎం ఎమ్మెల్యే పేరు ప్రస్తావించడంపై కాంగ్రెస్ శ్రేణులతో పాటు ఉమ్మడి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'సాసర్‌కుండ్'కు పర్యాటకుల రద్దీ



సాసర్‌కుండ్ జలపాతం

కుభీర్: మండలానికి ఆనుకుని ఉన్న మహారాష్ట్రలోని సాసర్‌కుండ్ జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో మండలంలోని వివిధ గ్రామాల భక్తులూ తరలివచ్చి జలపాతం పక్కనే ఉన్న మహదేవ్ మందిరంలో పూజలు చేశారు. కొందరు అక్కడే వంట చేసుకుని భోజనాలు చేశారు.

నిర్మల్‌లో మాజీ గవర్నర్ జయంతి



నిర్మల్‌ఖిల్లా: నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శనివారం కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అర్ల గంగాధర్, బారే శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం శివశంకర్ పేరిట స్మారక పోస్టల్ స్టాంప్ విడుదల చేయాలని, జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. శివశంకర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. అనంతరం జూలూరు గౌరీ శంకర్ రచించిన 'మా వాటా మాకే...' పుస్తకాన్ని ఆవిష్కరించారు. మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు బోనగిరి సుజయ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, సభ్యులు జాప లక్ష్మణ్, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

భైంసా పట్టణంలో..

భైంసాటౌన్: పట్టణంలోని బృందావన్ గార్డెన్స్‌లో మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ జయంతిని నిర్వహించారు. బీసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్రమంత్రిగా, గవర్నర్‌గా బడుగుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి, మున్నూరుకాపు సంఘం నాయకులు మల్లేశ్, అనిల్, చొప్పరి వెంకటేశ్ తదితరులున్నారు.

కలెక్టర్‌క్యాంప్ పక్కన కల్వర్టు తవ్వకం

- మురుగునీరు వెళ్లే పనులు షురూ..

సాక్షి స్పందన

నిర్మల్: 'అడుసు తొక్కకుండా.. అడుగు వేయలేం..' శీర్షికన సాక్షి దినపత్రిక ఈనెల 9వ తేదీన జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురించిన ప్రత్యేక కథనానికి అధికారులు స్పందించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌క్యాంప్ కార్యాలయం పక్కన, ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై పారుతున్న డ్రెయినేజీ నీటిని సరిచేసే పనులు చేపట్టారు. పలు కాలనీల్లో ఏర్పడ్డ గుంతలు పూడ్చివేశారు. మున్సిపల్ అధికారులు డ్రెయినేజీని పరిశీలించి ఇబ్బందికరంగా ఉన్న కల్వర్టును తొలగింపజేశారు. డ్రెయినేజీ నీరు రోడ్డుపైకి రాకుండా కాలువ నిర్మించడంతో పాటు కొంత ఎత్తులో కల్వర్టు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రియదర్శినినగర్‌తో పాటు వివిధ కాలనీల్లో గల గుంతల రోడ్లపై డస్ట్ పోసి పూడ్చే పనులు చేపట్టారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



కల్వర్టును తవ్వుతున్న మున్సిపల్ సిబ్బంది


సాక్షి
అడుసు తొక్కకుండా.. అడుగు వేయలేం!

సాక్షి ప్రచురించిన కథనం

సమస్యల 'స్టేషన్'!



వర్షంలో ప్లాట్‌ఫాంపై తడుస్తూ వెళ్తున్న ప్రయాణికులు (ఫైల్)

- పూర్తికాని అమృత్‌భారత్ పనులు
- నెరవేరని ప్రత్యేక రైలు డిమాండ్
- బాసరలో ప్రయాణికుల పాట్లు

భైంసా: బాసర రైల్వేస్టేషన్ సమస్యల నిలయంగా మారింది. జిల్లాలో మూడు కిలోమీటర్ల మేర రైల్వేలైన్ ఉండగా బాసరలో స్టేషన్ ఉంది. ఇక్కడ జ్ఞాన సరస్వతీ పుణ్యక్షేత్రంతోపాటు ట్రిపుల్‌ఐటీ ఉంది. వేలాదిమంది భక్తులు, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే బాసర రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస వసతులు కరువయ్యాయి. వానాకాలంలో ప్లాట్‌ఫాంపై భక్తులు తడుస్తున్నారు. ప్లాట్‌ఫాంపై రైళ్లు వస్తే బోగీలను సూచించే పరిస్థితి లేకుండా పోయింది. ఏ బోగి ఎక్కడ ఆగుతుందో తెలియక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

ఆర్నెళ్ల క్రితం పనులు ప్రారంభించినా..

బాసర రైల్వేస్టేషన్ అమృత్‌భారత్ పథకం కింద ఎంపికై ంది. గత ఫిబ్రవరి 26వ తేదీన అప్పటి ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ వర్చువల్ విధానంలో పనులు ప్రారంభించారు. కానీ.. ఆర్నెళ్లయినా పనులు పూర్తికాలేదు. బాసర రైల్వేస్టేషన్‌ను పూర్తిగా ఆధునికీకరించి వెయిటింగ్‌హాల్, మరుగుదొడ్లు, ఎస్కలేటర్స్, లిఫ్ట్ ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించారు. రైల్వేస్టేషన్ ముందు భాగాన్ని ఆధునికంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నా కానీ.. ఇప్పటికీ పనులు ప్రారంభంకాలేదు.

రద్దీ స్టేషన్ అయినప్పటికీ..

దక్షిణమధ్య రైల్వేకు కేంద్రమైన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి బాసర మీదుగా నిత్యం 55 రైళ్ల రాకపోకలు కొనసాగిస్తున్నాయి. బాసర స్టేషన్ నుంచి నిత్యం మూడువేల మంది టికెట్ కొని ప్రయాణిస్తుంటారు. వేలాదిమంది రైల్వేపాస్‌లపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రలోని షిర్డీకి వెళ్లిన యాత్రికులంతా తిరుగుప్రయాణంలో బాసరలో దిగి అమ్మవారి దర్శనం చేసుకుని వెళ్తుంటారు. ఎంతో రద్దీగా ఉండే బాసర స్టేషన్‌లో సరైన వసతులు లేక భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్యాసింజర్ రైలు కోసం...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బాసర రైల్వేస్టేషన్ నుంచి సికింద్రాబాద్ వరకు ప్యాసింజర్ రైలు ప్రారంభించాలని ఆదిలాబాద్, నిజామాబాద్ ఎంపీలు పలుసార్లు రైల్వేశాఖ మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చారు. జ్ఞాన సరస్వతీ ప్యాసింజర్ రైలు పేరిట నిత్యం నడిపేలా చూడాలని ప్రయాణికులు కూడా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. నిజామాబాద్, ఆదిలాబాద్ ఎంపీలు ఇప్పటికైనా కేంద్రమంత్రిపై ఒత్తిడి పెంచి బాసర నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలు నడిపేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వానొస్తే తడుసుడే..



వర్షం పడితే బాసర రైల్వేస్టేషన్‌లో ఇబ్బందులు పడుతున్నాం. ప్లాట్‌ఫాంపై పూర్తిగా షెడ్డు నిర్మించకపోవడంతో వానొస్తే తడుస్తున్నాం. వర్షపు నీరంతా ప్లాట్‌ఫాంపై నిలుస్తోంది. ప్లాట్‌ఫాంపై ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియడంలేదు. అధికారులు వెంటనే అమృత్ భారత్ పనులు వేగవంతంచేసి స్టేషన్‌ను ఆధునికీకరించాలి.
– సాయికుమార్, యాత్రికుడు

ప్యాసింజర్ రైలు నడపాలి



నిజామాబాద్ వరకు నడిపే ప్యాసింజర్ రైలును బాసరకు వరకు పొడిగించాలి. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్యాసింజర్ రైళ్లు కిక్కిరిసి ఉంటున్నాయి. అందులో నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోంది. సికింద్రాబాద్ నుంచి బాసర వరకు సరస్వతీ అమ్మవారిపేరిట ప్యాసింజర్ రైలును రోజూ నడిపితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది.
– శేఖర్‌రావు, యాత్రికుడు

ఘనంగా సత్యనారాయణ వ్రతపూజ

బాసర: బాసరలోని పాపహరేశ్వరాలయంలో శనివారం మండల కేంద్రంలోని 37 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ వ్రతపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. శ్రీత్రిపురవత్సల రామసేవా సమితి, గ్రామాభివృద్ధి కమిటీ సహకారంతో వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు ముందుగా సత్యనారాయణ స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించి వ్రత కథ విశిష్టతను భక్తులకు వినిపించారు. పూజల అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదం అందజేసి వారిని ఆశీర్వదించారు.

క్లుప్తంగా

నాగోబా ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగుల పంచమి సందర్భంగా నాగోబా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని మెస్రం వంశీయులు శనివారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,80,895, తైబజర్ ద్వారా రూ.28,060లు ఆదాయం వచ్చిందని ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ చైర్మన్ మెస్రం తుకారాం తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఈ డబ్బులను ఖర్చు చేస్తామన్నారు. మెస్రం బాదిరావ్, కోసేరావ్, దేవ్‌రావ్, శేఖర్‌బాబు, సోనేరావ్, వంశీయులు శేక్‌నాథ్, గ్రామస్తుడు కోట్నాక్ బారిక్‌రావ్ తదితరులు ఉన్నారు.

భార్య ఫిర్యాదుతో భర్తపై కేసు

నేరడిగొండ: భార్యభర్తల గొడవలో భార్య ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కొర్టికల్(బి) గ్రామానికి చెందిన తిత్రే అనిత–అశోక్ దంపతులు గత కొంత కాలంగా మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. అనిత ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుంది. భర్త అశోక్ పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు మద్యం తాగి లేనిపోని వివాహేతర సంబంధాలు అంటగడుతూ అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు శనివారం ఇంట్లో వంట చేసే సామగ్రితో అనిత తలపై కొట్టడంతో రక్తస్రావమైంది. బాధితురాలి ఫిర్యాదుతో భర్త అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పేకాట స్థావరంపై దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కొన్ని నెలలుగా గుట్టుగా సాగుతున్న పేకాటస్థావరాన్ని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. పక్కా సమాచారంతో అశోక్‌నగర్ బస్తీలోని ఓ ఇంటిపై శనివారం దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వీరిలో ఓ మహిళ కౌన్సిలర్ భర్త ఉన్నారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.19,500 నగదు, 6 సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి విచారణ కోసం ఏడుగురిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

కోటపల్లిలో..

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి అటవీప్రాంతంలో పక్కా సమాచారంతో ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం పేకాట స్థావరంపై దాడి చేశారు. నలుగురిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,34,750 నగదు, 3 సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలను సీజ్ చేశామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆగస్టు వర్షాలపైనే భారం!

- భారీ వరదొస్తేనే ఎస్సారెస్పీలోకి నీరు
- ప్రస్తుతం 47.25 టీఎంసీలు
- మహారాష్ట్రలోనూ వర్షాలు అంతంతే
- బాబ్లీ గేట్లు ఎత్తినా చేరని నీరు

ప్రాజెక్టు: శ్రీరాంసాగర్
పూర్తిస్థాయి నీటి మట్టం: 90 టీఎంసీలు
ప్రస్తుత నీటిమట్టం: 47.25 టీఎంసీలు
గతేడాది నీటి మట్టం: 77.289 టీఎంసీలు



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

భైంసా: ముసురు వర్షంతో గోదావరి నది ఇప్పటివరకు ఉప్పొంగలేదు. మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురియలేదు. గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను జూలై 1న ఎత్తిన ఎస్సారెస్పీలోకి వరద నీరు అనుకున్నంత చేరలేదు. ఆగస్టులో భారీ వర్షాలు కురిస్తేనే పూర్తిస్థాయిలో నిండనుంది. గతేడాది ఈ సమయానికే ఆరుసార్లు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. ఈఏడాది ఒక్కసారి గేట్లు ఎత్తే పరిస్థితి రాలేదు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లు కూడా ఎత్తలేదు.

ప్రస్తుత పరిస్థితి..

ఎస్సారెస్పీలో ప్రస్తుతం 1080.80 అడుగుల నీటి మట్టం ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు. ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఈ సమయానికి 77.289 టీఎంసీల నీరు నిలవ్వగా ఈసారి ఆ స్థాయిలో వరదనీరు చేరలేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.05 ఉంది. లక్ష్మీ కెనాల్ ద్వారా 50, సరస్వతీ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఇక మిషన్ భగీరథ పథకంలో 231 క్యూసెక్కుల నీటిని ఎస్సారెస్పీ నుంచే పలు జిల్లాలకు రోజు పంపిణీ చేస్తున్నారు. తాగునీటి అవసరాలకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు 63 క్యూసెక్కులు, కోరుట్ల, జగిత్యాలకు 61 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డిలకు 107 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 43.569 టీఎంసీల నీరుచేరగా, ఇప్పటి వరకు 3.839 టీఎంసీల నీటిని బయటకు వదిలేశారు.

ఆ నాలుగు జిల్లాలో ఆయువుపట్టు

జిల్లాలోని చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులన్నీ మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే వాగులు వంకలతోనే నిండుతాయి. ఈ నీరంతా ఉప నదుల నుంచి గోదావరిలో ప్రవహించి ఎస్సారెస్పీలోకి చేరుతుంది. ఎస్సారెస్పీ తెలంగాణలో ఉన్నప్పటికీ నది క్యాశ్‌మెంట్ ఏరియా అంతా మహారాష్ట్రలోనే ఉంది. ఔరంగాబాద్‌కు దిగువన పెద్ద ప్రాజెక్టులు లేకపోవడంతో మరట్‌వాడ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు వరదగా మారి ఎస్సారెస్పీ వైపు పరుగులు తీస్తుంది. ఔరంగాబాద్, జల్నా, పర్బనీ, నాందేడ్ జిల్లాల్లో కురిసిన వర్షాలే గోదావరి నదికి వరదను మోసుకువస్తాయి. ఈ ఏడాది మహారాష్ట్రలో గోదావరి ఉపనదులైన పూర్ణ, ప్రవరల పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురియలేదు. ఫలితంగా బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తినా భారీ వర్షాలు కురిస్తేనే బాసర వద్ద గోదావరిలో నీటి ప్రవాహం పెరుగుతుంది.

ఎత్తిపోతలకు కష్టమే

ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌తో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకు సాగునీరందుతుంది. బ్యాక్‌వాటర్‌తో సరిహద్దు ప్రాంతాల్లోని బోరుబావుల్లో నీరు పెరుగుతుంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం ఉంటేనే పంటలు వేసుకోవచ్చు. వర్షాకాలం మినహా వేసవిలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. మరోవైపు ఎస్సారెస్పీ నుంచి సారంగాపూర్, కుంటాల మండలాల్లోని చాలా గ్రామాలకు నీటిని అందించేందుకు కాలువలు తవ్వించారు. దీని గుండా పొలాలకు పూర్తిస్థాయిలో నీరందే పరిస్థితి లేదు.

ప్రణాళికాబద్ధంగా నీటి విడుదల

ప్రణాళికాబద్ధంగానే నీటిని వదులుతున్నాం. ప్రాజెక్టులో 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రోజువారీగా మిషన్ భగీరథ పథకంలో సాగునీటి కోసం నీరు విడుదల చేస్తున్నాం. పంటల కోసం లక్ష్మీ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సరస్వతీ కెనాల్‌కు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం.

– చక్రపాణి, ఎస్సారెస్పీ ఈఈ

మెరుగైన వైద్యం అందించాలి

- డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రవీంద్రనాయక్



గర్భిణితో మాట్లాడుతున్న రవీంద్రనాయక్

గుడిహత్నూర్: గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రవీంద్రనాయక్ అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. రికార్డులు, లేబర్ రూం, గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వెయిటింగ్, ఫార్మసిస్ట్, వ్యాక్సిన్లు నిల్వ చేసే గదులను పరిశీలించారు. వ్యాక్సిన్‌లు నిల్వ చేసేందుకు కరెంట్ అవసరమని, సోలార్ బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై గర్భిణులు, సాధారణ రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీలో వసతులు, అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉన్న సిబ్బంది, బదిలీల్లో ఖాళీ అయిన స్థానాల భర్తీ, ప్రస్తుత పరిస్థితి ఏమిటని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్‌ని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా ఖాళీలు ఉంటే వెంటనే భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సీలో హీటింగ్ సిస్టం, సోలార్ సిస్టం అత్యవసరమని వైద్యుడు శ్యాంసుందర్ ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్‌తో చర్చించి అందుబాటులోకి తెస్తామన్నారు. ఆయన వెంట అడిషనల్ డీఎంహెచ్‌ఓ సాధన, ఎన్‌ఎస్‌డీ ప్రోగ్రాం ఆఫీసర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్, డీఎంహెచ్‌ఓ ఆఫీస్ సూపరింటెండెంట్లు గోపి, శ్రీకాంత్, యునాని డాక్టర్ సదియా ఉన్నారు.

సిరాల్ ఉత్సవాలు



మహిళల సంప్రదాయ నృత్యం



పూజలు చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: శ్రావణమాసంలో నాగుల పంచమి మరుసటి రోజున నిర్వహించే సిరాల్ ఉత్సవాలను అంధ్ ఆదివాసీ తెగకు చెందిన మహిళలు మండలంలోని గ్రామాల్లో శనివారం నిర్వహించారు. గ్రామ పొలిమేరలో పుట్ట మట్టిని గ్రామపెద్ద ఇంటికి తీసుకువచ్చి సిరాల్ దేవతలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సంతనం లేని వారికి సంతన ప్రాప్తి కలగాలని, పంటలు పండాలని సిరాల్ దేవతకు మొక్కినట్లు అంధ్ ఆదివాసీ పెద్దలు తెలిపారు. అనంతరం సిరాల్ విగ్రహాలను ఊరేగిస్తూ మహిళలు చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి పూజలు చేసి వాగుల్లో వదిలేశారు. గ్రామపెద్దలు ముఖడే విష్ణు, ముఖడే ఉత్తం, గారుశే దశరథ్, బాలాజీ తదితరులు ఉన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

తాంసి: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కలీం కథనం ప్రకారం..మహారాష్ట్రలోని ఘటాంజి గ్రామానికి చెందిన సారజీ(38), రవి భార్యభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. సారజీ తన కుటుంబంతో కలిసి భీంపూర్ మండలం నిపాని గ్రామంలోని అక్క రాథోడ్ రుక్మా వద్ద గత కొన్నేళ్లుగా ఉంటుంది. సారజీ భర్త రవి గత మూడేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. భార్యను మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు. భర్త వేధింపులు తాళలేక సారజీ శనివారం ఉదయం వడ్గాం శివారు చేనులో చెట్టుకు ఉరేసుకుంది. గ్రామస్తులు అందించిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. మృతురాలి సోదరి రాథోడ్ రుక్మా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి..

కడెం: గత నాలుగేళ్ల క్రితం అమ్మానాన్నలు, రెండేళ్ల క్రితం అన్న మృతిచెందడంతో జీవితంపై విరక్తితో గుర్తు తెలియని పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై భీంరావు కథనం ప్రకారం.. కడెం మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన గొట్టం రాకేశ్(21) గతనెల 31న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి, నిర్మల్ ఆసుపత్రికి పంపించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

బోథ్: మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజు(42) రిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై రాము కథనం ప్రకారం.. రాజు గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఈనెల 8న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రిమ్స్‌లో ఇద్దరు మృతి..

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం ఇద్దరు మృతి చెందారు. టూ టౌన్ ఏఎస్సై ముకుందరావు కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా మాలే బోరిగావ్ గ్రామానికి చెందిన కరహాలే పరమేశ్వర్ (22) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 6న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదేవిధంగా మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకాకు చెందిన గురునులే శ్రీరామ్(55) పంట చేనులో పురుగుల మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురై, రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. శ్రీరామ్ భార్య లక్ష్మీప్రియ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిచ్చిమొక్కలతో జెడ్పీ ఉద్యానవనం



పరిసరాల పరిశుభ్రతతోపాటు పచ్చదనంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. అలాంటి ఆదిలాబాద్ జెడ్పీ కార్యాలయంలోని ఉద్యానవనం పిచ్చిమొక్కలతో నిండి అధికారుల నిర్వాకానికి నిలువుటద్దంలా నిలుస్తోంది. వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలతో ఆహ్లాదకరంగా కనిపించాల్సిన ఉద్యానవనం పిచ్చిమొక్కలతో నిండి ఉండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి బీడీ మన్మోహన్ బాక్సింగ్ టోర్నమెంట్ పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బీడీ మన్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఎంతోమంది ప్రతిభ ఉన్న బాక్సింగ్ క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాకు బాక్సింగ్ ఖేలో ఇండియా సెంటర్ మంజూరు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖ బాక్సింగ్ క్రీడాకారులు నిఖత్ జరీన్, హుసాముద్దీన్‌లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రవీందర్, టీబీఏ ప్రతినిధులు రవీందర్, బాల్ బహదూర్, కృష్ణ, శ్రీనివాస్, ఎల్లయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, నల్గొండ, నిజామాబాద్ ప్రతినిధులు రవీందర్‌గౌడ్, షంషుద్దీన్, జిల్లా అధ్యక్షుడు విజయేందర్, శేఖర్, బేగ్, బాక్సింగ్ కోచ్ సాయి, జూడో కోచ్ రాజు ఉన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న మన్మోహన్, తదితరులు

ఫలితమిస్తున్న గడ్డిక్షేత్రాలు

- గతేడాది జన్నారం డివిజన్‌లోనే 72 హెక్టార్లు
- ఐదేళ్లలో 900 హెక్టార్లు
- పెరుగుతున్న వన్యప్రాణుల సంఖ్య



జన్నారం డివిజన్‌లో గడ్డి మైదానం

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ 893 చదరపు కి.మీ విస్తీర్ణంలో కోర్ ఏరియా, 1123 చదరపు కి.మీలో బఫర్ ఏరియా విస్తరించి ఉంది. ఈ ప్రాంతాన్ని 2012లో కేంద్రం టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేసింది. అప్పటినుంచి పులుల రాకపోకలే తప్ప ఇక్కడ అవాసం ఏర్పాటు చేసుకున్న దాఖలాలు లేవు. శాఖహార జంతువుల సంతతి పెంచి, టైగర్‌జోన్‌లో పులి అవాసం ఏర్పర్చుకునేలా అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. అడవిలో వన్యప్రాణుల సంఖ్య అనేది ఆవాసాల్లో విస్తరించి ఉన్న గడ్డిక్షేత్రాల సాంద్రతపై ఆధారపడి ఉంటుంది. కనీసం పది శాతం గడ్డిక్షేత్రాలు విస్తరించి ఉంటే శాఖహార జంతువుల సంతతి పెరుగుతుంది. ఈ క్రమంలోనే పులి వచ్చే అవకాశాలు మెండుగా ఉంటుందనేది అధికారులు యోచన.

అధికారులకు శిక్షణ

గడ్డిక్షేత్రాల పెంపకంతో జింకలు, దుప్పులు, సాంబర్లు, నీలుగాయిలు, కొండగొర్రెలు, అడవి దున్నలు, గడ్డిజింకలు, ఇతర వన్యప్రాణులు ఆధారపడి జీవిస్తాయి. పులులు, చిరుతపులులు, నక్కలు, అటవీ కుక్కలు, తోడేళ్లు ఆధారపడుతాయి. గడ్డిక్షేత్రాల పెంపకంపై అధికారులకు జన్నారంలో మహారాష్ట్రకు చెందిన నిపుణుడు డా.జీడీ మురత్కర్ 2018లో శిక్షణ ఇచ్చారు. సహజ గడ్డిక్షేత్రాలు, విత్తనాల సేకరణ, ముళ్ల కంచెల తొలగింపు, కలుపు మొక్కల నివారణ, గడ్డి విత్తనాల నిల్వ సస్యరక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. అప్పటినుంచి ప్రారంభమైన గడ్డి క్షేత్రాల పెంపకం ప్రస్తుతం ఫలితాలిస్తోంది.

2018 నుంచి పెంపకం

2018 నుంచి కవ్వాల్ టైగర్‌జోన్‌లో గడ్డి క్షేత్రాలు పెంపకానికి శ్రీకారం చుట్టింది. 2023 వరకు 900 హెక్టార్లలో ఈ క్షేత్రాలు పెంచారు. దేశంలోని పలు టైగర్ జోన్ల అధికారులు గడ్డిక్షేత్రాల పరిశీలనకు జన్నారం రావడం విశేషం. వీటి నిర్వహణ, చేపడుతున్న చర్యలు, వన్యప్రాణులకు ఇష్టమైన గడ్డి తదితర అంశాలపై అవగాహన పొందారు. కొన్ని ప్రాంతాల్లో గడ్డి విత్తనాలను చల్లి సహజసిద్ధంగా గడ్డిని పెంచుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో సహజసిద్ధంగా మొలసిన గడ్డి చుట్టూ కంచె వేసి, కలుపు తొలగిస్తూ పెంపకం చేస్తున్నారు.

జన్నారం అటవీ డివిజన్‌లోనే 72 హెక్టార్లు

రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సరం వంద హెక్టర్లలో గడ్డి మైదానాలు ఏర్పాటు చేయగా అందులో 72 హెక్టార్లు జన్నారం అటవీ డివిజన్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఏడాది తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి మూడు రేంజ్‌ల్లో కలిపి 172 హెక్టార్లు గడ్డి క్షేత్రాలు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. గత రెండేళ్ల క్రితం పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య రెట్టింపు అయింది. ఖానాపూర్, ఉట్నూర్, జన్నారం, ఆసిఫాబాద్ అటవీ డివిజన్లలో 300 హెక్టార్లలో పెంచాలని ఆదేశాలు ఉన్నాయి.

గడ్డి మైదానాలు పెంచుతాం

విరివిగా గడ్డి మైదానాలు పెంచడం వల్ల వన్యప్రాణుల సంఖ్య పెరుగుతుంది. కవ్వాల్ టైగర్ జోన్‌లో 300 హెక్టార్లలో గడ్డి మైదానాలు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని డివిజన్లలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– శాంతారాం, ఎఫ్‌డీపీటీ

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం గ్రామ సమీపంలో నిర్మల్–భైంసా రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. ముధోల్‌కు చెందిన సాయినాథ్ తన కిరాణా సామగ్రి కోసం ఆటో తీసుకుని నిర్మల్‌కు వచ్చాడు. కొనుగోలు అనంతరం తిరిగి వెళ్తుండగా అతి వేగంగా నిర్మల్ వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఆటో పల్టీలు కొట్టింది. ఆటో డ్రైవర్ జాదవ్ వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జ్వరంతో వివాహిత మృతి



రోషిణి మృతదేహం

కాసిపేట: జ్వరంతో బాధపడుతున్న వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిందని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలానికి చెందిన రోషిణి (24), కాసిపేట మండలంలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన ముక్కెర వెంకటేశ్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయినప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. కులపెద్దలు పలుమార్లు పంచాయితీ నిర్వహించి ఇద్దరు కలిసి ఉండాలని సూచించారు. గురువారం రోషిణికి జ్వరం వచ్చింది. భర్త ఆమెను శుక్రవారం బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగా ఫిట్స్ రావడంతో రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. కాగా, కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీపీ గేట్ ఫలితాల్లో ప్రతిభ



రమాతాయి, విఠల్



ఇంకేసర్ ఆలం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సీపీ గేట్ (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్) ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. 2021–24 బ్యాచ్ విద్యార్థి ముండే విఠల్.. సీపీ గేట్ ఫలితాల్లో ఏకంగా మూడు సబ్జెక్టుల్లో ర్యాంకులు సాధించి సత్తా చాటాడు. ఎంఏ హిందీలో 2వ ర్యాంకు, ఎంఏ ఎకనామిక్స్‌లో 9వ ర్యాంకు, హిస్టరీలో 108వ ర్యాంకు సాధించాడు. సీయూఈటీ(పీజీ)–కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్–2024 సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షలో కర్ణాటక సీయూలో ఎంబీఏ సీటు సాధించడం విశేషం. కళాశాలకు చెందిన మరో విద్యార్థి ఇంకేసర్ ఆలం..ఎంఏ ఎకనామిక్స్‌లో 23వ ర్యాంకు సాధించాడు.

అక్కాతమ్ముళ్ల అదుర్స్

గుడిహత్నూర్ మండలం కొల్హారి గ్రామానికి చెందిన ముండే విఠల్ అక్క రమాతాయి గత సంవత్సరం జరిగిన సీపీ గేట్ ఫలితాల్లో ఎంఏ హిస్టరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ఎంట్రెన్స్ లో జాతీయస్థాయిలో 85వ ర్యాంకు సాధించి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సంపాదించింది. అక్కా తమ్ముళ్లు సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందడం పట్ల తల్లిదండ్రులు దొండిరామ్–సుమిత్రలకు పలువురు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ జలగం అనిత, అధ్యాపకులు సంతోష్ కుమార్, కోటయ్య, స్వప్న, నందిని, పృథ్వీలు విద్యార్థులను అభినందించారు.

ఆలయంలో చోరీ



ఎల్లమ్మ గుడిని పరిశీలిస్తున్న పోలీసులు

కుభీర్: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం రాజగౌడ్ వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉంది. గుడిగంట, సిలిండర్ ఎత్తుకెళ్లారని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆలయ పరిసరాలను పరిశీలించారు. పాంగ్ర గ్రామం వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా మహేశ్ తురాఖాన్‌ను బైక్‌పై వెళ్తుండగా తనిఖీ చేయగా గుడిగంట, సిలిండర్ లభించింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆస్పత్రిలో టోకెన్ నంబర్ తీసుకునేందుకు ఈనెల 9న చుక్కల విఠల్ బస్సులో నిర్మల్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బయటకు వస్తున్న ఆయన్ను గమనించిన రాపాని శ్రీను, వేముల సుజాత, రాజమణి అడ్డగించారు. అతని మెడలో 6 గ్రాముల బంగారు గొలుసు, జేబులో రూ.950 నగదు, సెల్‌ఫోన్ దోచుకొని పారిపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ గంగారెడ్డి సహాయంతో బస్టాండ్ ఏరియాలో ఇద్దరు దొంగలను శనివారం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.950 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని సీఐ పేర్కొన్నారు.